క్లుప్తంగా

బోరు బావిని ధ్వంసం చేసిన వారిపై ఫిర్యాదు


బావిని చూపుతున్న రైతు బాగులు

మిరుదొడ్డి(దుబ్బాక): బోరు బావిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ధర్మారం గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ గూళ్ళ బాగులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 15రోజుల క్రితం తన వ్యవసాయ పొలంలో నూతనంగా తవ్వించిన బోరు బావిని గిట్టని కొందరు వ్యక్తులు అందులో రాళ్ళువేసి బోరు ధ్వంసం చేశారని ఆరోపించారు. మోటారుకు ఉన్న క్లాంపులతో పాటు, వంక పైపును బోరు బావిలో పడేశారని, ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తులను శిక్షించాలని మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నియామకాల కోసం ధర్నా


ధర్నా చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: ఎల్‌ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఉద్యోగులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ సంఘం నాయకులు మాట్లాడుతూ వెంటనే క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. బెస్ట్ క్యాడర్స్, అసిస్టెంట్స్, సబ్ స్టాఫ్ పోస్టులను భర్తీచేయాలని కోరారు. కార్యక్రమంలో సదాశివ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రాజేశ్ కుమార్, కర్ణాకర్ తదితరులు ఉన్నారు.

ఉద్యమనేత అశోక్‌కుమార్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉద్యమ నేత.. వై.అశోక్‌కుమార్ అని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య అన్నారు. చిన్నకోడూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వై.అశోక్ కుమార్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్పొరేట్ శక్తులు, రియల్ వ్యాపారులను మేధావుల సభకు పంపడం సరికాదని చెప్పారు. ఆయనకు ఉపాధ్యాయ ఉద్యమంలో 36 యేళ్ల అనుభవం ఉందని, నిరంతరం అందుబాటులో ఉండే ఆయననే గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో యాదగిరి, కనకరాజు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గండిపల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న రాజయ్య తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గండిపల్లి గ్రామంలో బొడ్రాయి పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులంతా ఉదయం నుంచే బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావటంతో గ్రామంలో సందడి నెలకొంది. గురువారం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్పర్సన్ సిరిసిల్ల రాజయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజయ్య, సంజీవ్ రెడ్డి, రాజిరెడ్డి, పరశురాం, బంధం శ్రీనివాస్, బైరగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం


అధ్యాపకులతో మాట్లాడుతున్న హరికృష్ణ

సిద్దిపేటజోన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో అధ్యాపకులను కలిసి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది కాలంలో 55 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. 22న సిద్దిపేటలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా సభ నిర్వహించనున్నామని, మంత్రులు సురేఖ, ప్రభాకర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అత్తు, యాదగిరి, కలిమ్, రాజ్ బహదూర్ రెడ్డి, వహిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన నిఘా నేత్రాలు

గ్రామాల్లో పెరిగిన చోరీలు

- నిర్వహణలో నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా కీలకం. గ్రామాలు, పట్టణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా అమర్చుకోవాలని స్థానికులు, వ్యాపారులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కాని చాలా చోట్ల అమర్చిన నిఘా నేత్రాలు సక్రమంగా పని చేయడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో నేరస్తులు, దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది.


చిన్నకోడూరు ప్రధాన కూడలిలో సీసీ కెమెరా దుస్థితి

చిన్నకోడూరు(సిద్దిపేట): చాలా చోట్ల సీసీ కెమెరాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో వాటి నిర్వహణ గాడి తప్పింది. మరమ్మతులకు గురైతే అంతే సంగతులు. ఇక వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో గతంలో గ్రామ పంచాయతీలు, పోలీసులు, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్నాళ్లు అంతా సవ్యంగా సాగింది. రానురాను నిర్వహణ గాడితప్పి చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. కెమెరాలు నేల వైపు వంగడం, కేబుల్ ఊడిపోవడం, పూర్తిగా ధ్వంసం కావడం వంటి దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. వాటికి మరమ్మతులు చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

వరుస దొంగతనాలు

గ్రామాల్లో అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని దుండగులు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులకు దొంగలను పట్టుకోవడం సవాలుగా మారింది. పదిరోజుల క్రితం చిన్నకోడూరులో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 125 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇంటి ఎదుట పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లి ఒకటి అనంతసాగర్ శివారులోను, మరొకటి చిన్నకోడూరు శివారులోను వదిలి వెళ్లారు. పెద్దకోడూరులో ఇంటి ఎదుట ఉన్న బైకును ఎత్తుకెళ్లి మందపల్లి శివారులో వదిలి వెళ్లారు. అలాగే ఒక మేకను కూడా ఎత్తుకెళ్లారు.


అలిరాజ్‌పేటలో నర్సరీని పరిశీలిస్తున్న జయదేవ్

ఉపాధి కూలీల సంఖ్య తగ్గొద్దు

డీఆర్డీఏ పీడీ జయదేవ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య 25 మందికి తగ్గకుండా చూడాలని డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆదేశించారు. మండలంలోని అలిరాజ్‌పేటలోని నర్సరీ, నిర్వహణలో ఉన్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. అనంతరం మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. వంద ఎకరాల్లో ఆర్టికల్చర్‌ను గుర్తించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పశువుల పాకలు, పంట పొలాలకు రోడ్ల నిర్మాణ పనులు, గుట్టల చుట్టూ చదును కందకాలు, అలాగే నర్సరీల నిర్వహణ తదితర పనులను పూర్తిచేయించాలని కోరారు. పని ప్రదేశాల వద్ద ప్రథమ చికిత్స పెట్టె, తాగునీరు, నీడ కల్పించాలని సూచించారు. ఎఫ్‌ఏలు కూలీలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఎంపీఓ ఖాజామోహినుద్దీన్, ఏపీఓ శైలజ, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జీవశాస్త్ర చిత్రాల ముగ్గులు


విద్యార్థినులు వేసిన చిత్రాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'లైఫ్ కాన్వాస్ ది ఆర్ట్ ఆఫ్ బయాలాజికల్ మార్వెల్స్' అనే కార్యక్రమం నిర్వహించారు. జువాలజీ, బాటనీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జీవశాస్త్రానికి సంబంధించిన 25కుపైగా చిత్రాలను ముగ్గుల రూపంలో విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ తమ చదువులను విద్యార్థినుల ముగ్గుల రూపంలో సృజనాత్మకంగా ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సైన్స్ గొప్పదనాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్వేత, స్వప్న, సువర్ణాదేవి, కిషోర్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీమ్ భరోసా

రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): మహిళల భద్రతకు షీ టీమ్ ఎల్లవేళలా భరోసాగా ఉంటుందని గజ్వేల్‌రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు అవహేళనకు, హింసకు గురైతే వెంటనే డయల్-100, షీటీమ్ వాట్సాప్ 87126 67343, మహిళా పోలీస్‌స్టేషన్ 87126 67435కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి, షీ టీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు, పీసీలు లావణ్య, మహేశ్, భరోసా సెంటర్ సిబ్బంది హరిత, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

కొండపాక(గజ్వేల్): ఇష్టపడి చదివితేనే ఉన్నతమైన భవిష్యత్ ఉంటుందని త్రీ టౌన్ ఎస్‌ఐ మల్లేశం చెప్పారు. మండలంలోని బందారం హైస్కూల్లో విద్యర్థులకు అవగాహన కర్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచంద్రం, ఉపాధ్యాయులు, షీటీం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వర్గల్(గజ్వేల్): మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

డ్రగ్స్‌పై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మిరుదొడ్డి ఎక్సైజ్ ఎస్‌ఐ సరిత మాట్లాడారు. జీవితాలను చిన్నాభిన్నం చేసే డ్రగ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది కృష్ణాగౌడ్, షాబొద్దీన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.12,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

గజ్వేల్‌రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని బయ్యారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల కృష్ణవేణి బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త పెన్షన్లు లేక వృద్ధుల అవస్థలు

బెజ్జంకి(సిద్దిపేట): కొత్త పెన్షన్లు లేక వృద్ధులు అవస్థలు పడుతున్నారని ఏఐవైఎఫ్ మండల నేత మహేశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు తీసుకుని యేళ్లు గడుస్తున్నప్పటికీ అర్హులకు పించన్లు మంజూరు కావడంలేదని వాపోయారు.

లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించలేదు

భవన నిర్మాణ కార్మిక సంఘం నేత చంద్రం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా నేటికీ లేబర్ బోర్డు కమిషనర్‌ను నియమించకపోవడం శోచనీయమని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం వాపోయారు. సిద్దిపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లేబర్ బోర్డు వద్ద రూ.2వేల కోట్ల నిధులు ఉన్నా కమిషనర్ లేకపోవడంతో ప్రమాదాలకు గురైన కార్మికులకు నిధులు కేటాయించుకునే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. కార్మికులు పడే కష్టాలను ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, కార్మికులకు ప్రమాదాలు జరిగితే తక్షణమే బీమా వర్తింపచేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడటంపై హర్షం వ్యక్తం చేశారు. సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే విధంగా చొరవ చూపాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

తొగుట(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రవికాంత్‌రావు సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు చూడొద్దని, అలాంటి మెసేజ్‌లు ఓపెన్ చేస్తే మీ ఖాతాల్లోని డబ్బులు కొట్టేస్తారన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఎవరైనా విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు వేయాలన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ కోర్సులలో ఉచిత శిక్షణను అందించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో కంప్యూటర్ విభాగాధిపతిని సంప్రదించాలని సూచించారు.

అర్హులైన రైతులందరికీ రుణాలివ్వండి

లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హరిబాబు

సిద్దిపేటరూరల్: సిద్దిపేట బ్లాక్‌కు సంబంధించి అర్హత మేరకు రైతులకు వ్యవసాయరుణాలు అందించాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హరిబాబు బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సిద్దిపేట బ్లాక్ 16 మండలాలు, 3 మున్సిపాలిటీలకు సంబంధించి జాయింట్ మండల్ బ్యాంకర్ల కమిటీ త్రైమాసిక సమావేశాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, పీఎం ఎఫ్‌ఎంఈ లాంటి ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, స్వయం సహాయక బృందాల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం నిఖిల్‌రెడ్డి, జేడీ ఏహెచ్. వెంకటరెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం విద్యాసాగర్, డీపీఎం వాసుదేవ, డైరెక్టర్ రాజలింగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరిబాబు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


వీరానగర్ ప్రాథమిక పాఠశాలలో..


వర్గల్(గజ్వేల్): విద్యార్థులతో ఉపాధ్యాయులు


దుబ్బాకరూరల్: ఉపాధ్యాయులుగా విద్యార్థులు చీకోడ్ పాఠశాలలో..

వర్గల్(గజ్వేల్): మండలంలోని తున్కిఖాల్సా జెడ్పీ హైస్కూల్‌లో గురువారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. డీఈఓగా కొమ్ము శ్రీచైతన్య, డిప్యూటీ ఈఓగా కల్యాణ్, హెచ్‌ఎంగా టి.ప్రవళిక వ్యవహరించారు. ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు జ్ఞాపికలు అందజేశారు.

వీరానగర్ పాఠశాలలో..

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం వీరానగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన కార్యక్రమంలో ఎంఈఓగా ధనుష్, హెచ్‌ఎంగా వర్షిణి తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శిరీష ఉపాధ్యాయులు నవీన్ కుమార్, కవిత, సీఆర్పీలు యాదగిరి, స్వామి పాల్గొన్నారు.

చీకోడ్ పాఠశాలలో..

దుబ్బాకరూరల్: చీకోడ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎం రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విద్యా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో జోన్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో మార్చి 2న రిమ్మనగూడ జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు రాజులు ఉద్యోగ విరమణ సందర్భంగా సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం, అరుణోదయ సాంస్కృతిక సమైక్య గౌరవాధ్యక్షురాలు విమలక్క, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి హాజరవుతునన్నట్లు తెలిపారు. రాజులు, రామచంద్రం, ఎల్లయ్య, సత్యనారాయణ, నర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి, విద్యాసాగర్, రాజనర్సింహ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలలను పరిశీలించిన డీఈఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంతో పాటు అంతక్కపేట, జనగామ, పంతుల్‌తండాల్లోని ప్రభుత్వ ఉన్నత, పాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోతు రంగానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ కులగణన చేపట్టడం సంతోషకరం

సిద్దిపేటకమాన్: కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టడం సంతోషకరమని ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శుక్రొద్దిన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి పోటీల్లో ఉన్నారన్నారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేసి గెలపించాలని కోరారు.

◆ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శ



బెజ్జంకి(సిద్దిపేట): స్వేరోస్ నెట్ వర్క్ రాష్ట్ర నాయకులు బొర్ర సురేశ్ తల్లి బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో ముత్తన్నపేటలో మృతి చెందిన విషయం తెలుసుకొని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, స్వేరోస్ వ్యవస్థాపకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఆమె చిత్ర పటంవద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, బాబు, మోహన్, పరశురాములు పాల్గొన్నారు.

◆ నీరు విడుదల చేయాలని వినతి

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్, అచ్చుమాయిపల్లి, ఆరెపల్లి, పోతారం, గంభీర్‌పూర్ గ్రామాలకు సాగునీరు అందించాలని కోరుతూ రైతులు సిద్దిపేట డివిజన్ ఈఈకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు సమీపిస్తున్న తరుణంలో పంటలకు నీరందక ఎండిపోయె దుస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి పంటలకు నీరందించాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. రైతు లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కోమటిబండ గ్రామానికి చెందిన ఆబ్బని నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

కోహెడ(హుస్నాబాద్): కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్‌రావు కోరారు. మండల కేంద్రంలో ఎన్నికల ఇన్‌చార్జిలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పిందని, తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఖమ్మం వెంకటేశం, నర్సయ్య, శ్రీనివాస్, రజనీకాంత్‌రెడ్డి, సుధాకర్, శివకుమార్, సతీశ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

◆ కొనుగోలు పరిమితి పెంచాలని వినతి

చేర్యాల(సిద్దిపేట): రైతులు పండించిన కంది పంట కొనుగోలు పరిమితిని పెంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఉడుముల బాల్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన మంత్రిని కలిసి మాట్లాడారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల మాత్రమే మద్దతు ధర ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఎక్కువ దిగుబడి సాధించిన రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు పరిమితిని పెంచాలని కోరారు.

◆ పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొమురవెల్లి(సిద్దిపేట): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్రిముచ్చాల గ్రామ శివారులో బొడుగం బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడిచేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,107 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.